సాక్షి
గుంటూరు
గురువారం । 3 । జూలై । 2025



సాల్వేషన్ ఆర్మీ వార్షికోత్సవం

తెనాలి అర్బన్: సాల్వేషన్ ఆర్మీ వార్షికోత్స బుధవారం ఐతానగర్‌లోని చర్చి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. గేరా థామస్, సీయోను కుమారిలు జెండా ఎగురవేశారు.



పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

నరసరావుపేట: క్యాంపు కార్యాలయంలో బుధవారం పీఎం ఫసల్ బీమా యోజన, వాతావరణ పంటల బీమా పథకం పోస్టర్లను కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు.



శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

నగరం: జిల్లేపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు.

న్యూస్‌రీల్

సింగయ్య కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు

సింగయ్య భార్య వ్యాఖ్యలపై స్పందించిన జిల్లా ఎస్పీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు : చీలి సింగయ్య మృతి కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి పట్టాభిపురం స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. సింగయ్య భార్య లూర్దుమేరీ మీడియాతో మాట్లాడిన వీడియో చూసినట్లు తెలిపారు. సింగయ్య మృతిపై ఆమె కొన్ని అనుమానాలు వ్యక్తం చేసిందని, ఈ కేసు విషయంలో తాము ప్రతి విషయాన్నీ పరిగణలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనకు సంబంధించి చాలా వీడియో ఫుటేజ్‌లు, డ్రోన్ ఇమేజ్‌లు దొరికాయని, ఆ ఫుటేజ్‌లను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు చెప్పారు. రిపోర్టులో ఆ ఫుటేజీలు ఎడిట్ కానీ, మార్ఫింగ్ కానీ చేసినవి కావని నిర్ధారణ అయ్యిందన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ పరిశీలించినప్పుడు సింగయ్య ఛాతీ కుడివైపున చీలిక గాయంతోపాటు ఛాతీ ఎముకలు ఫ్రాక్చర్ అయి లంగ్స్‌లోకి గుచ్చుకున్నట్లు, లివర్‌కు కూడా గాయం అయినట్లు వచ్చిందన్నారు. అన్ని భౌతిక, సాంకేతిక కోణాల్లో దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేస్తామని తెలిపారు.

భూములిచ్చిన రైతులకు ప్లాట్లు చూపించాలి



తాడేపల్లి రూరల్: ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని రాజధాని రైతు సంఘం నేత కె. ఈశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉండవల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రెడ్డితో పాటు నేతలు మాట్లాడుతూ రాజధానిలో పది గ్రామాలను సందర్శించినట్లు తెలిపారు. పదేళ్ల కిందట రైతులు పొలాలను పూలింగ్‌కు ఇచ్చారని, ఇంత వరకు వారి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. గతంలో ఇచ్చిన 33,500 ఎకరాలు భూమిని అభివృద్ధి చేయకుండా ఇప్పుడు మరో 45 వేల ఎకరాలు తీసుకోవడానికి జీవో ఇవ్వడం అన్యాయమని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 29 గ్రామాల రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వై. కేశవరావు, జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాస రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పండుగ వేడుకలను పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. హజరత్ మొహమ్మద్ మనుమలు హజరత్ ఇమామే హసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరిస్తూ వేడుకలు జరుపుకొన్నారు. ఏడవ రోజు బుధవారం ప్రధాన రహదారిలోని పీర్ల చావిడిలో హజరత్ అలీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొల్లా ముజావర్ల కమిటీ మొల్లా కరీమ్, మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని, మొల్లా నజీర్, షేక్ , ఖాదర్, మొల్లా అల్లాబక్షి, మొల్లా నజుముద్దీన్, మొల్లా ఖాలీల్ బాషా, మొల్లా బాజి, షేక్ గౌస్, మొల్లా రహంతుల్లా, మొల్లా ఆర్షద్, మొల్లా జలీల్, మొల్లా ఇమ్రాన్, మొల్లా జైనులాబద్దీన్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు పీఆర్కే పరామర్శ



సత్తెనపల్లి: తన చావుతోనైనా పోలీసుల అరాచకాలు ఆగాలని ఆత్మహత్యకు యత్నించి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాజుపాలెం మండలం పెద్దనెమలిపురికి చెందిన గుత్తా లక్ష్మీనారాయణను వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిలు బుధవారం పరామర్శించారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అండగా ఉంటామని చెప్పారు.

కూటమి మోసాలపై యుద్ధానికి సిద్ధం

- 1999 నుంచి హామీలు ఇవ్వడం.. మరవడం బాబుకు మామూలే!
- వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- టీడీపీ ఇవ్వని వాటిని ఇంటింటికీ వెళ్లి వివరించాలి
- వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సన్నాహక సభలో నేతల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వై.వి. సుబ్బారెడ్డి , వేదికపై పార్టీ నేతలు





కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లి రూరల్: ''ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలను మరొకసారి వంచించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు కూటమి మోసాన్ని, దగాను ప్రజలకు వివరించేందుకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. దానిలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి''నట్లు వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి రూరల్‌లోని కుంచనపల్లి ఫార్చ్యూన్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో గుంటూరు, పల్నాడు జిల్లాల వైఎస్సార్‌సీపీ నాయకుల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నరసరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్వర్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి, వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త గజ్జల సుధీర్ భాస్కర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు, తెనాలి నియోజకవర్గ సమన్వయ కర్త అన్నాబత్తుని శివకుమార్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), గుంటూరు,పల్నాడు జిల్లాల వైస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సెల్‌ఫోనే ఆయుధం

ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో– ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేయడం ప్రథమం కాదని తెలిపారు. 1999 నుంచి ఆయన పొత్తులతో గెలిచి ఇదే పద్ధతిని అవలంబిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి, గెలిచిన తరువాత ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాల కన్నా ఎక్కువ ఇస్తామంటూ చంద్రబాబు పవన్ కల్యాణ్‌లు హామీ ఇచ్చారని, అమలు చేసే సమయానికి మాట దాటవేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇచ్చిన సంక్షేమ పథకాలను వివరించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని సూచించారు. కరోనా సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలన గురించి, చంద్రబాబు ఇప్పుడు వైద్యరంగాన్ని ఏ విధంగా నాశనం చేస్తున్నారో వివరించాలని చెప్పారు. పెన్షన్లు పెంచామని చెప్పి ఎంతమందికి అందడం లేదనేది కూడా వివరించాలని పేర్కొన్నారు.

– వై.వి. సుబ్బారెడ్డి ,
వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్

మోసాన్ని వివరించాలి



కూటమి ప్రభుత్వం చేతిలో మరోసారి మోసపోయామని ప్రజలు ఒక అభిప్రాయానికి వచ్చారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో సంవత్సరంలోపే ఇచ్చిన హామీలన్నీ 90 శాతం అమలు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను అమలు చేస్తానని చెప్పి మోసం చేసింది. అమలు చేసిన పథకాల్లో సైతం కోత విధించింది. అనర్హులుగా తేల్చి పలువురి పెన్షన్లు, తల్లికి వందనం తీసివేశారు. సూపర్‌సిక్స్‌ను అమలు చేస్తారా లేదా అన్నది కూడా నమ్మకం లేదు. వైఎస్సార్ సీపీలో జరిగిన మంచిని, కూటమి ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించడమే మన లక్ష్యం.

–మురుగుడు హనుమంతరావు,
శాసనమండలి సభ్యులు

కార్యకర్తలే బలం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తను సముచిత స్థానం ఉంటుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలకు ఎంత మేలు జరిగిందో మనందరికీ తెలుసు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఏ విధంగా మోసపోతున్నారో మనం చూస్తున్నాం. వాటిని ప్రశ్నించి ప్రజలకు మేలు జరిగేలా ప్రతి ఒక్క కార్యకర్తా పనిచేయాలి.

– అంబటి రాంబాబు,
గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి

పార్టీకి కార్యకర్తలే వారధి



వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు వారధి లాంటి వారు. వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. రెండు అబద్ధాలు చెప్పి ఎన్నికలకు వెళదామని పలువురు నాయకులు చెప్పినా జగన్‌మోహన్‌రెడ్డి అందుకు ఒప్పుకోలేదు. సచివాలయాలు, వలంటీర్ల వల్ల మనం దెబ్బతిన్నాం.

–మోదుగుల వేణుగోపాలరెడ్డి,
మాజీ ఎంపీ

మోసాలను బహిర్గతం చేయాలి



కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇంటింటికీ తిరిగి బాండ్లు ఇచ్చారు. ఈ హామీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టారు. ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా ప్రజల్ని మోసగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ – మోసాలు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాలుగు విడతల్లో ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.

– నూరి ఫాతిమా,
గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త

క్రమశిక్షణతో మెలగాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు మన పోరాటాలు ఆపకూడదు. క్రమశిక్షణతో మెలగాలి. మంగళగిరి నియోజకవర్గం నుంచి బాబు ష్యూరిటీ మోసాలు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషించదగ్గ విషయం. ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించేందుకు సిద్ధంగా ఉండాలి.

– దొంతిరెడ్డి వేమారెడ్డి,
మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త

ప్రగతి.. అధోగతి



నిర్మాణానికి నోచుకోని 32వ వార్డు ఇందిరా కాలనీలోని రోడ్డు



40వ వార్డులోని మురుగు కాల్వ

- తొలి ఏడాది ఆంధ్రా ప్యారిస్‌లో కుంటుపడిన అభివృద్ధి
- చేసిన పనులకు చెల్లింపు నిల్
- కౌన్సిల్ ఆమోదించిన పనులకు టెండర్లు పిలవడంలో ఉదాసీనత

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలి జిల్లాలోని ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ. అభివృద్ధిలో పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంది పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణ అభివృద్ధి శరవేగంగా పరుగులు పెడుతుందని నమ్మబలికారు. మున్సిపల్ నిధులతో కొన్ని పనులను ఆర్భాటంగా ఆరంభించారు. ఏడాది తర్వాత చూస్తే బిల్లుల చెల్లింపు సున్నా...కొత్తగా ఆమోదం తెలిపిన పనులకు నెలలు గడుస్తున్నా టెండర్లూ పిలవడం లేదు.

కౌన్సిలర్ల ఆందోళన

ప్రభుత్వ విధానంపై మున్సిపాలిటీలో పనులు చేసిన కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి కూడా నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. సాక్షాత్తూ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కూడా బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతోనే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని ప్రకటించడం గమనార్హం.

రూ.8.50 కోట్ల బిల్లులు పెండింగ్

పట్టణంలో గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 105 అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.8.50 కోట్ల బిల్లులను మున్సిపల్ అధికారులు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరగలేదని అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ బ్యాంకు ఖాతాల్లో నిధులున్నా నిబంధనల ప్రకారం చెల్లింపులు జరగని పరిస్థితి నెలకొంది.

పేరుకే అజెండాలో నిధులు

ప్రతి నెలా జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అధికారులు వివిధ అభివృద్ధి పనులను అజెండాలో పొందుపరుస్తున్నారు. కౌన్సిల్ నుంచి అనుమతి తీసుకున్నప్పటికి వాటిలో ఎక్కువ భాగం టెండర్ల దశకు వెళ్లడం లేదు. ఇందుకు నిధుల కొరతను సాకుగా అధికారులు చూపుతున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై కౌన్సిలర్ల నిరసనతో వాడివేడిగా కొనసాగింది. సుమారు ఎనిమిది నెలలు గడచినప్పటికీ, ఇప్పటికీ టెండర్ల దశకు పనులు చేరుకోకపోవడాన్ని కౌన్సిలర్లు ప్రశ్నించారు. తెనాలి పట్టణంలో రూ.7.70 కోట్ల విలువైన 46 పనులను చేపట్టేందుకు కౌన్సిల్ అనుమతించినా, ఆయా పనులు ఇప్పటివరకు టెండర్ల దశకు వెళ్లలేదు, కౌన్సిల్‌లో అధికారులు ఇదే విషయాన్ని సభ్యులకు తెలియజేశారు.

బిల్లుల చెల్లింపుల్లో మార్పులు

కూటమి ప్రభుత్వం ఇటీవల బిల్లుల చెల్లింపుల్లో మార్పులు తీసుకొచ్చింది. గతంలో చేసిన తరువాత వర్కింగ్ ఇన్‌స్పెక్టర్, ఏఈ, డీఈ, ఎంఈ, కమిషనర్‌లు ఆయా పనులను పరిశీలించి బిల్లులు రూపొందించే వారు. అందరి ఆమోదంతో ఆడిట్‌కు పంపేవారు. వారి అనుమతి తరువాత కాంట్రాక్టర్ల అకౌంట్‌లో చెల్లింపులు జరిగేవి. ఇప్పుడా విధానం మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నిధి యాప్‌లో బిల్లులను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అధికారుల అనుమతి తరువాత చెల్లింపులు జరగాల్సి ఉంటుంది. అయితే, నిధి యాప్‌లో లోపాలతో బిల్లులు పెట్టడానికి అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు వాపోతున్నారు. యాప్‌లోని సమస్యలను పరిష్కరించే వరకు బిల్లులు చెల్లింపులు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది.

కూటమి విష ప్రయోగం

- గుంటూరు చానల్‌లో గడ్డి మందు పిచికారీ
- పట్టించుకోని అధికారులు
- కుళ్లిపోతున్న గుర్రపు డెక్క, తూటికాడ
- కలుషితమవుతున్న నీరు
- సాగు, తాగునీరుగా ఉపయోగిస్తున్న పలు గ్రామాల ప్రజలు



పెదకాకాని శివారులో ఎండిపోయిన గుర్రపుడెక్క, తూటికాడ

పెదకాకాని: ఖరీఫ్‌లో రైతులకు సాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం పంట కాలువల శుభ్రం చేపట్టింది. పెదకాకాని మండలంలో రెండు పంట కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. జిల్లాలోని సీతానగరం వద్ద ప్రారంభమైన గుంటూరు చానల్(కొత్త కాలువ) వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు వరకూ 47 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ కాలువ పొడవునా 33 గ్రామాల ప్రజలు మంచినీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. లక్షలాది ఎకరాల్లో వరి పంట సాగు అవుతోంది.

నీటి సంఘాల కక్కుర్తి

ఏటా కాలువల్లో పేరుకు పోయిన గుర్రపుడెక్క, నాచు, తూటికాడ తొలగించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించి, పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తుంది. అయితే, ఈ ఏడాది కూటమి ప్రభుత్వం నీటి సంఘాల నాయకులకు అప్పగించింది. మంగళగిరి రూరల్ మండలం కాజ శివారు ప్రాంతం నుంచి బుడంపాడు వరకూ 17 కిలోమీటర్ల పొడవునా గుర్రపుడెక్క, తూటికాడ, నాచు తొలగించేందుకు రూ. 24 లక్షలు కేటాయించింది. యంత్రాలు, కూలీలను ఉపయోగించి చేయాల్సిన పనుల్లో నీటి సంఘాల నాయకులు కక్కుర్తి పడ్డారు. డబ్బులు మిగుల్చుకునే పనిలో భాగంగా కాలువ పొడవునా గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో తూటికాడ, గుర్రపుడెక్క ఎండి కుళ్లిపోతోంది. నీరు దుర్వాసన వెదజల్లుతోంది.

అధికారుల పర్యవేక్షణ కరువు

గుంటూరు చానల్ నీటిని పలు గ్రామాల ప్రజలు తాగునీటికి వినియోగిస్తున్నారు. కలుషిత నీరు వల్ల వ్యాధుల బారిన పడే ప్రమాదముందని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం గడ్డి మందు పిచికారీ చేయకూడదు. నిధులు మాత్రం మంజూరు చేసి సాగునీటి శాఖ అధికారులు పనుల పర్యవేక్షణ మరిచిపోయారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



తాగే నీటిలో గడ్డి మందు పిచికారీ చేయడం ముమ్మాటికీ విష ప్రయోగమే. నీరు తాగడం వల్ల మనుష్యులు, పశువులు రోగాల బారిన పడతారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నివారించాలి.

–సంకూరు నీలాంబరం, రైతు పెదకాకాని

వర్షా కాలంలో పనులేంటి ?



పొక్లెయిన్‌తో తొలగించకుండా నీటి సంఘాల నాయకులు గడ్డి మందు చల్లించారు. ఎండిన ఆకులు, మొక్కలు నీటిలో పడి కుళ్లుతున్నాయి. ఎండా కాలం చేయాల్సిన పనులు పొలంలో విత్తులు పెట్టే సమయంలో చేస్తున్నారు. కాలువకు నీళ్లు ఎప్పుడు వదులుతారో.. ప్రశ్నార్థకమే !

–ఆలపాటి చిన నాగేశ్వరరావు, కౌలు రైతు.

చర్యలు తీసుకోవాలి



డబ్బులు మిగుల్చుకునేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాలువ పొడవునా 33 గ్రామాల ప్రజలు త్రాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

– నన్నపనేని శివాజీ,
సీపీఎం కార్యదర్శి, పెదకాకాని మండలం

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపు

ఉచిత విద్య ప్రవేశాల్లో విద్యాశాఖ వైఖరిపై నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ప్రవేశాల పేరుతో ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు అవలంబిస్తున్న తీరుపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వ్యతిరేక వైఖరితో ఉన్నాయి. విద్యార్థుల ప్రవేశాలపై విద్యాశాఖాధికారులు ఒత్తిడి చేయడంతో పాటు వ్యక్తిగతంగా దూషణలకు పాల్పడటం, నోటీసులు జారీ, పాఠశాలలను సీజ్ చేస్తున్న సంఘటనలపై గురువారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి. తల్లిదండ్రులకు సమాచారాన్ని పంపారు. విద్యాహక్కుచట్టంలోని 12 (1) సీ ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించింది. తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఆప్షన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు పూర్తి చేసింది. అయితే, అసంబద్ధ విధానాలు నెలకొన్నాయని ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యాశాఖాధికారుల ఏకపక్ష చర్యలకు నిరసనగా స్వచ్ఛందంగా పాఠశాలలను మూసి వేస్తున్నామని పేర్కొన్నారు. ఒకే పాఠశాలకు పదుల సంఖ్యలో విద్యార్థులను కేటాయించిన అసంబద్ధ విధానాలపై నిరసన వ్యక్తం చేయడంతో పాటు ఫీజుల చెల్లింపులో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 754

కొమ్ములు : 123 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,250	10,425	10,300

కాయలు : 60 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,250	10,425	10,250

మొత్తం అమ్మకాలు : 137.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	46,390
అమ్మకాలు	45,224
నిల్వ	10,119

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,200
273	రూ.10,000 – 12,500
341	రూ. 10,000 – 13400
సూపర్ –10	రూ. 9,700 – 12,400

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 14,000
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,600
ఆర్మూర్	రూ. 9,700 – 11,000
తాలుకాయలు	రూ. 5,000 – 6,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 12,800
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,200
4884	రూ. 10,000 – 12,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,600
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

భూముల సమీకరణ ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, సీహెచ్ బాబూరావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ప్రభుత్వం రాజధాని కోసం మరో దఫా 44వేల ఎకరాలు భూమిని సమీకరిస్తున్నట్లు ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబూరావు మాట్లాడారు. 11 సంవత్సరాల కిందట తీసుకున్న 34వేల ఎకరాలతో పాటు ప్రభుత్వ భూములతో కలిపి 54వేల ఎకరాలు అందుబాటులో ఉందని తెలిపారు. మరో 44 వేల ఎకరాలు తీసుకోవడం అంటే అది అమరావతి రైతుల ప్రయోజనాలకు విఘాతమని విమర్శించారు. గతంలో ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నోచుకోలేదని పేర్కొన్నారు. సమీపంలో గన్నవరం విమానాశ్రయం ఉండగా అంతర్జాతీయ విమానాశ్రయం ఎందుకని ప్రశ్నించారు. గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం భూములు తీసుకున్నారని, అది ఇప్పటికీ కొలిక్కి రాలేదని తెలిపారు. రాజధాని కొలిక్కి రాకుండా అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో ఇప్పుడు వేల ఎకరాల భూములు సమీకరించడం సబబు కాదని ఖండించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.స్ భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళీనికాంత్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట టోకరా

- ఢిల్లీలోని విద్యాంజలి సంస్థ పేరుతో నియామక ఉత్తర్వులు
- నిరుద్యోగ యువతకు ఎరవేస్తున్న మోసగాళ్లు
- ఉద్యోగాల పేరుతో మోసపోవద్దని సమగ్ర శిక్ష ఎస్పీడీ సూచన



విద్యాంజలి సంస్థ పేరుతో సృష్టించిన తప్పుడు నియామక పత్రం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాల పేరుతో మోసగాళ్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులను పోలిన నియామక పత్రాలను సృష్టించి, బురిడీ కొట్టిస్తున్నారు. విద్యాంజలి సంస్థ పేరుతో కొంత మంది వ్యక్తులు జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రికార్డ్ అసిస్టెంట్లు, యోగా టీచర్లు, అటెండర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తప్పుడు నియామక ఉత్తర్వులను సృష్టించి, రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. తాజాగా విద్యాంజలి సంస్థ పేరుతో గుంటూరు జిల్లా తుళ్లూరులోని జెడ్పీ హైస్కూల్లో ఒకేషనల్ ట్రైనర్‌ను నియమిస్తున్నట్లుగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం పంపుతున్నట్లుగా సిద్ధం చేసిన నియామక ఉత్తర్వుల కాపీ ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. జెడ్పీ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ నియామక విషయమై సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు దృష్టికి వెళ్లడంతో ఆయన ఇదంతా బోగస్ అని, ఎవ్వరూ నమ్మవద్దని కొట్టిపారేశారు. క్షేత్రస్థాయిలో ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుని నిరుద్యోగ యువత మోసపోకుండా చూడాలని సమాచారం పంపారు. ప్రధానోపాధ్యాయులు కూడా తప్పుడు నియామక ఉత్తర్వులపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

బాలిక హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ప్రత్యేక దృష్టి సారించిన డీఎస్పీ
- 24 గంటల్లోపు వివరాల సేకరణ



పాపను నీళ్లలో పడవేసిన వంతెన



హేమ మృతదేహం

తాడేపల్లి రూరల్: కుంచనపల్లి జాతీయ రహదారిపై గల బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి పైనుంచి బాలికను నీటిలోకి విసిరేసి హత్య చేసిన సంఘటనలో 24 గంటలు గడవకముందే బుధవారం తాడేపల్లి పోలీసులు వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఓ మహిళ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. పోలీసులు మూడు గంటలు కష్టపడి బాలిక మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్ట్‌మార్టం నిమిత్తం ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వెంటన్ నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి, మంగళగిరి పట్టణ, రూరల్, పెదకాకాని సీఐ, ఎస్ఐలతో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కుంచనపల్లి బ్రిడ్జి వద్ద, జాతీయ రహదారిపై ఉన్న కెమెరాలను పరిశీలించారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో బాలికను గుర్తు తెలియని వ్యక్తి నడిపించుకుంటూ బ్రిడ్జి ఎక్కినట్లు నమోదైంది. మృతి చెందిన బాలిక, సీసీ కెమెరాల్లో కనిపిస్తున్న బాలిక ఒకరే కావడంతో ఫొటోలను కృష్ణా, గుంటూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు పంపారు. వివరాలు సేకరించాలంటూ కోరారు. తాడికొండ మండలం బడేపురానికి చెందిన పాపగా గుర్తించడంతో అక్కడకు వెళ్లి వివరాలు సేకరించారు. పేరు కూరపాటి హేమ అని, మతిస్థిమితం లేదని స్థానికులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పాపను పెంచలేక తాతయ్య ఈ పని చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలువలోకి తోసిన వ్యక్తి సరిగ్గా కనిపించకపోవడంతో పాటు లుంగీ ధరించి ఉన్నాడు. హత్య చేసింది తాతయ్య లేక ఎవరన్నా ఉన్నారనే విషయాలను లోతుగా తాడేపల్లి సీఐ వీరేంద్ర దర్యాప్తు చేశారు. చివరికి తాత కూరపాటి మాధవరావే కాల్వలోకి తోసేశాడని పోలీసులు నిర్ధారించారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,200

మోడల్ ధర రూ. 1,600

రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే !

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్
- ఆత్మహత్య చేసుకున్న నాగరాజు కుటుంబానికి పరామర్శ



ప్రత్తిపాడులో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రత్తిపాడు: రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ మండిపడ్డారు. ప్రత్తిపాడు వైఎస్సార్ కాలనీలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు చల్లగిరి నాగరాజు కుటుంబాన్ని బుధవారం సాయంత్రం రైతు సంఘం నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ కౌలు రైతు నాగరాజు పంటలు పండకపోవడం, గిట్టుబాటు ధరలు, కౌలు రైతు కార్డు లేకపోవడం, బ్యాంకులు రుణం ఇవ్వకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని తెలిపారు. ప్రైవేటు సంస్థల నుంచి వందకు మూడు నుంచి ఐదు రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చి, అవి తిరిగి చెల్లించలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రభుత్వం వెంటనే స్పందించి నాగరాజు కుటుంబానికి రూ. 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎకరం ప్రభుత్వ భూమిని ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేసి, తిరిగి నూతనంగా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి, పొగాకు సాగు చేసిన 10 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు నివారిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. పరామర్శించిన వారిలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు, నాయకులు కె. ఆదినారాయణ, నల్లమోతు రాజేంద్ర ఉన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం కృష్ణా కెనల్ రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 55–60 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఆచూకీ తెలిపే ఆధారాలు ఏవీ లభ్యం కాలేదని తెలిపారు. వంటిపై గాయాలను బట్టి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

ముగ్గురు మహిళలు, పిల్లలు అదృశ్యం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : గుంటూరు నగరం కోబాల్డ్‌పేటలో ముగ్గురు మహిళలు, వారి పిల్లలు అదృశ్యమైనట్టు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్డ్‌పేట ఆరవలైన్‌కు చెందిన మహిళ రజీయకు ముగ్గురు సంతానం ముస్తఖిమ్, ముజమీర్, మేరిన్. మరో మహిళ సైదాబీకి ఒక కుమార్తె అముల్. మరో మహిళ సాహిదాకు ముగ్గురు సంతానం ఎం.డి సాహిల్, అబ్దుల్ సలీం, అబ్దుల్ ఆసీఫ్. వీరంతా బంధువులు. ఒకే భవనంలో అద్దెకు ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా రజీయ, సైదాబి, సాహిదా వారి పిల్లలతో బట్టలు, బ్యాగ్‌లు, చివరకు టీవీ సైతం చేత పట్టుకుని వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, నాయకులు

మంగళగిరి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వై. కమలాకర్, ఎం. బాలాజీ, యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, కేదారనాథ్, దుర్గారావు, ప్రకాష్, రాము పాల్గొన్నారు.

పాత బంగారం కొనుగోలు పేరిట మోసం

- పెదకాకాని దర్గాలో నిద్రల పేరుతో నిందితులు ఆశ్రయం
- అదుపులోకి తీసుకున్న శ్రీకాళహస్తి పోలీసులు

పెదకాకాని: పాత బంగారం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని నమ్మించి మోసాలు చేస్తున్న దొంగల ముఠాను పెదకాకాని బాజీ బాబా దర్గాలో శ్రీకాళహస్తి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ ప్రాంతానికి చెందిన ఐదుగురు ముఠాగా ఏర్పడ్డారు. అమాయక ప్రజలను నమ్మించి మోసాలు చేసి, అక్కడ నుంచి దర్గాలో నిద్రల పేరుతో మంగళవారం పెదకాకాని బాజీబాబా దర్గాకు చేరుకున్నారు. నిందితుల్లో ముగ్గురు మగ, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఎక్కువ ధరకు పాత బంగారం కొనుగోలు చేస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి, నమ్మించి వారి నుంచి కొనుగోలు చేస్తారు. ఇచ్చే డబ్బుల కట్టల్లో పైనా, కిందా మంచి నోట్లు పెట్టి మధ్యలో తెల్ల పేపర్లు పెడతారు. ఇక్కడ చూస్తే పోలీసులు పట్టుకుంటారు.. ఇంటికి వెళ్లి లెక్కించుకోవాలని చెప్పి అక్కడి నుంచి పరారీ అవుతారు. ఈ తరహా మోసాలపై బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బుధవారం శ్రీకాళహస్తి నుంచి సీఐ నాగార్జునరెడ్డితో కలసి ఆరుగురు పోలీసుల బృందం పెదకాకాని చేరుకుంది. మోసాలకు పాల్పడుతున్న ముఠా పెదకాకాని బాజీ బాబా దర్గాలో ఆశ్రయం పొందుతున్నట్లు నిర్ధారించుకున్నారు. పెదకాకాని పోలీసు సిబ్బంది సహకారంతో బుధవారం దర్గాకు చేరుకుని ముఠాను అదుపులోకి తీసుకుని శ్రీకాళహస్తి తరలించారు.

ఖరీఫ్‌లో 'ముంపు' ముప్పు



నేతాజీనగర్ వద్ద వాడ మురుగు డ్రెయిన్

రేపల్లె: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా పాలకులు, అధికారులు పూడికతీతపై నోరు మెదపడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌కు ముందే డ్రెయిన్‌లలో తూటికాడ, గుర్రపు డెక్కలను తొలగించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

రేపల్లె సబ్ డివిజన్‌లో ఇలా...

రేపల్లె సబ్ డివిజన్‌లో ప్రధానంగా ఆర్‌ఎం డ్రెయిన్, బీఎం డ్రెయిన్, జగజ్జేరువు కాలువ, రేపల్లె మురుగు కాలువ, వాడ మురుగు డ్రెయిన్, రేపల్లె న్యూకోర్స్, ఓల్డ్ కోర్స్‌లలో తూటికాడ, గుర్రపు డెక్క, ప్లాస్టిక్, చెత్త చెదారాలు పేరుకుపోయాయి. నియోజకవర్గంలో 34,060 హెక్టారులలో ఖరీఫ్‌లో వరి సాగు అవుతుంది. వృథా నీరు, అధిక వర్షాలు కురిసిన సమయంలో వరద ఈ కాల్వల ద్వారానే ముందుకు పోవాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. పంట చివరి దశ నవంబర్, డిసెంబరు మాసాలలో ఈ ప్రాంతాలలో అధిక వర్షం పడుతుంది. దీంతో రైతన్నలు భయాందోళనలకు గురవుతున్నారు.

యుద్ధ ప్రాతిపదికన చేస్తేనే..

కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా పూడికతీత చేపట్టకపోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ ఆరంభంలో కురిసిన వర్షాలతో కొంతమేర నష్టపోయారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన పూడికతీత ప్రారంభిస్తేనే ప్రయోజనం ఉంటుంది.